

కోరుట్ల: పట్టణంలోని బీసీ కాలనీలో మహిళలకు రజతోత్సవ సభ ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కోరుట్ల రూరల్ : జోగన్‌పల్లిలో ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# రజతోత్సవ సభకు తరలిరావాలి

- జిల్లా వ్యాప్తంగా ఆహ్వాన పత్రికలు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- సభకు జనం తరలించేందుకు గ్రామాల్లో నాయకుల ఏర్పాట్లు

సారంగాపూర్, ఏప్రిల్ 26: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరా పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ పిలుపునిచ్చారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు పర్యటించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. సభకు ప్రజలను తరలించేందుకు బస్సులు, ఇతర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నేరెల్ల సుమన్ గౌడ్, తేలు రాజు, ప్రధాన కార్యదర్శులు అనంతుల గంగారెడ్డి, కిషన్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్, ఏప్రిల్ 26: కోరుట్ల పట్టణంలోని బీసీ కాలనీ, అయ్యప్ప గుట్ట, చింతలవాడ కాలనీతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రజలు, ఆయా సంఘాల సభ్యులకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రజతోత్సవ సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేశారు. సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మాజీ ఎంపీపీ తోట నారాయణ బీఆర్ఎస్ నాయకులు భూపెల్లి నగేశ్, బింగి సంతోష్, కటుకం రవి, నూనె పోశెట్టి, రాములు, నారాయణ, దామ రమేశ్, పెద్ద లక్ష్మణ్, బంగారు రాజేశ్, బింగి మహేశ్, ఇప్ప సాయిలు, సరిత, రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లడానికి మండలంలో 19 బస్సులు ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు మామిడిపెల్లి రవి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలను పెద్ద సంఖ్యలో తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గండ్ర కిరణ్‌రావు, కేసరి సాయన్న, శీలం మోహన్‌రెడ్డి, సోమ దేవేందర్‌రెడ్డి, కిరణ్, సంజీవ్, ప్రతాప్‌రెడ్డి, గంగాధర్, రవి తదితరులున్నారు.



సారంగాపూర్: చిత్రవేణి గూడెంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ



కథలాపూర్: మండల కేంద్రంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

# రోడ్డుపైనే మిర్చి అమ్మకాలు

- వాహనదారులు, స్థానికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కనే విక్రయిస్తున్న ఎండు మిర్చి (ఫైల్)

మెట్‌పల్లి, ఏప్రిల్ 26: మెట్‌పల్లి పట్టణంలోని 63వ జాతీయ రహదారిని ఆనుకొని ఇరువైపులా ప్రతి మంగళవారం మిర్చి క్రయ, విక్రయాల మార్కెట్ కొనసాగుతున్నది. అసలే మండుతున్న ఎండలు, ఆపై రహదారికి ఇరువైపులా ఎండు మిర్చి అమ్మకాలతో రహదారిపై వచ్చిపోయే వాహనదారులు, ప్రయాణీకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి వార సంతకు కథలాపూర్ మండలం దుంపేట, దూలూరు, భూషణ్‌రావుపేట, పోతారం, చింతకుంట, మల్లాపూర్ మండలం సాతారం, రేగుంట, గొర్రెపల్లితో పాటు నిర్మల్ జిల్లా ఖానాపూర్, రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి, రుద్రంగి, తదితర ప్రాంతాల నుంచి రైతులు మిర్చి విక్రయించేందుకు తీసుకువస్తుంటారు. వారికి కూడా కనీస వసతులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండు మిర్చి విక్రయదారుల నుంచి తైబజార్ పేరిట మున్సిపల్‌కు ఆదాయం వస్తున్నా, వసతులు కల్పించడంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మిర్చి మార్కెట్‌కు ప్రత్యేక స్థలం కేటాయించి, వసతులు కల్పించాలని రైతులతో పాటు పట్టణ వాసులు కోరుతున్నారు.

## పహల్గాం మృతులకు నివాళి



కోరుట్ల రూరల్ : చిన్నమెట్‌పల్లిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కోరుట్ల/కోరుట్ల రూరల్/జగిత్యాల టౌన్/సారంగాపూర్, ఏప్రిల్ 26: పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం కోరుట్ల పట్టణంలో వేంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సయ్య, ఈవో విక్రమ్, ఆలయ ప్రధాన అర్చకుడు బీర్నంది లక్ష్మీనర్సింహాచార్యులు, ధర్మకర్తలు శ్రీనివాస్, దివాకర్, గంగాధర్, రాములు, విజయ్, పద్మ, రంజిత్, ఆలయ ఉద్యోగులు నర్సయ్య, పద్మ పాల్గొన్నారు. కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లిలో గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. జగిత్యాలలోని తహసీల్ చౌరస్తా వద్ద మహిళా ఐక్యవేదిక సభ్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఐక్యవేదిక నాయకులు భీమనాతిని ఉమాదేవి, మీనాక్షి, సింగం పద్మ, మాధవి, లక్ష్మి, మమత, సుజాత, తదితరులు పాల్గొన్నారు. సారంగాపూర్ మండలం పెంబట్లలోని గాంధీ విగ్రహం వద్ద గ్రామస్తులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోడేటి శేఖర్ గౌడ్, నాయకులు తేలు రాజు, తేలు గంగారెడ్డి, ఆకుల రమేశ్, వెంకటేశ్, శ్రీను, పోతు ప్రవీణ్, మహేశ్, అశోక్, ప్రభాకర్, రాజారెడ్డి, శ్రావణ్, కిషన్, కిష్టయ్య పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ

జగిత్యాల, ఏప్రిల్ 26: నియోజకవర్గంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, జగిత్యాలలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ ఎల్ రమణ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 26: గౌడన్నలకు రక్షణగా కాటమయ్య కిట్లు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం చలిగల్‌లో గౌడ సంఘ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించి, ఈత మొక్కలు నాటారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 45 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి సునీత, సీఐ సర్వేశ్వర్ రావు, ఎస్ఐ రాజేందర్, ఏఈ రాజమల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు దామోదర్ రావు, రాధ-రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి, సంఘం అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మెట్‌పల్లి, ఏప్రిల్ 26: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, సామాజిక అంశాలు, వివిధ చట్టాలపై న్యాయవాదులు వివరించారు. అనంతరం ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తొగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజెల్లి రాందాస్, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెగడపల్లి, ఏప్రిల్ 26: పెగడపల్లి మండలం బతికపల్లి, మద్దులపల్లి, ఐతుపల్లి, నామాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ రవీందర్ శనివారం పరిశీలించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట, వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సమత, సీసీలు రవికుమార్, శశికుమార్, తిరుపతి, అకౌంటెంట్ రాము, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సర్వే

మల్లాపూర్/పెగడపల్లి, ఏప్రిల్ 26: మల్లాపూర్ మండలం సాతారం, పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం శనివారం ఎంపీడీవోలు శశికుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేసిన అర్హులకు ఇండ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇక్కడ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులున్నారు.

## మహిళల సంక్షేమమే సర్కారు ధ్యేయం

జగిత్యాల, ఏప్రిల్ 26: మహిళల సంక్షేమమే సర్కారు ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పొన్నాల గార్డెన్‌లో శనివారం మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతలు మహిళా సంఘాలకే ఇచ్చి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నట్లు తెలిపారు. ఇక్కడ ఐకేపీ ఏపీఎం గంగాధర్, సీసీలు, గంగారం, రవీందర్, మరియా, విద్యాసాగర్, శ్రీనివాస్, తదితరులున్నారు.

## అధ్యాపకుల ఇంటింటా ప్రచారం

మెట్‌పల్లి, ఏప్రిల్ 26: మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి ప్రిన్సిపాల్ డా.వెంకయ్య, లెక్చరర్లు శనివారం మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపేటలో ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి ప్రచారం చేశారు. కళాశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయని, నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, కళాశాలలో ప్రవేశం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవన్న, మనోజ్‌కుమార్, అంజయ్య, గట్టయ్య, సత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



వెంకట్రావుపేటలో ప్రచారం చేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు

## భూ భారతి చట్టంతో రైతులకు మేలు

మల్లాపూర్, ఏప్రిల్ 26: భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం ద్వారా పక్కగా భూముల సరిహద్దులు, ఉచిత న్యాయ సాయం, సాదా బైనామా దరఖాస్తులు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడ్పుల పుష్పలత, తహసీల్దార్ వీర్ సింగ్, ఏవో లావణ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జగిత్యాల, ఏప్రిల్ 26: జగిత్యాలలోని పొన్నాల గార్డెన్‌లో జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల ప్రజలు, రైతులకు భూ భారతి చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాగా, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్లు రామ్మోహన్, శ్రీనివాస్, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, 93 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 87 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పంపిణీ చేశారు.

## క్రీడలతో మానసికోల్లాసం



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 26: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం, స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ మైదానంలో టీచర్స్ క్రికెట్ లీగ్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, నాయకులు దామోదర్ రావు, లక్ష్మణ్, మల్లికార్జున్, అనిల్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పంచాయతీ అధికారికి వినతి

జగిత్యాల, ఏప్రిల్ 26: జిల్లాలోని గ్రామాల్లో ప్రమాదాలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి మధుసూదన్‌కు శనివారం నాయకులు గోరుమంతుల సురేందర్, కురుమ దేవయ్య వినతి పత్రం అందజేశారు. కాలువలు, చెరువులు, కుంటల్లోకి చిన్న పిల్లలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు.

## ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల, ఏప్రిల్ 26: జిల్లా కేంద్రంలోని పావని కంటి దవాఖాన ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 13 మందికి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. అలాగే, కళ్లద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, దవాఖాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి



కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 26: ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని బండలింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి, 24 గంటల్లో కేటాయించిన మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని హమాలీలు ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేయాలన్నారు. ఇక్కడ ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులున్నారు.

## 29న వేలం పాట

మల్యాల, ఏప్రిల్ 26: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో దీక్షా స్వాములు సమర్పించిన ఇరుముడుల్లోని పలు వస్తువులను వేర్వేరుగా ఈనెల 29న టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఉదయం 10 గంటల్లోగా డిపాజిట్ చెల్లించిన వారిని మాత్రమే టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతిస్తామని, టెండర్‌లో అత్యధిక పాట పాడిన వారు వెంటనే సదరు మొత్తాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. బియ్యం పాట పాడేందుకు రూ. 10 వేలు, కొబ్బరికాయలు రూ. 5 వేలు, ఎండిన కుడుకులకు రూ. 5 వేల డిపాజిట్, ఇత్తడి గంటలకు రూ. 5 వేలు, ఎండు కర్జురాలు, పోకల కోసం రూ. వెయ్యి డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

## సంఘాలు-కార్యవర్గం



కొడిమ్యాల: ఎన్నికైన తుర్కాశీ సంక్షేమ సంఘం సభ్యులు

కొడిమ్యాల, ఏప్రిల్ 26: జగిత్యాలలో శనివారం తుర్కాశీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే బడేసాబ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జీగా మండలంలోని తుర్కాశీనగర్ గ్రామానికి చెందిన షేక్ కరీం, జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా షేక్ ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అలీ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యర్శి సయ్యద్ షరీఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ జహంగీర్, షేక్ షాదుల్లా, రాష్ట్ర నాయకులు సయ్యద్ ఎండీ అలీమ్, న్యాయవాది సయ్యద్ యామీన్, తుర్కాశీనగర్ మాజీ సర్పంచ్ షేక్ హైదర్, నాయకులు షేక్ చాంద్, షేక్ ముఖీబ్, షేక్ కరీం, షేక్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: ఎన్నికైన జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 26: జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా నాగేందర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్‌గా రవి బాబు, కో చైర్మన్లుగా ఎండీ వకీల్, శంకర్, చంద్రయ్య, శ్రీనివాస్, రాంరెడ్డి, గంగరాజం, హరి అశోక్‌కుమార్, సురేశ్, గంగనర్సయ్య, శ్యాంసుందర్, రాంచంద్రం, జితేందర్‌రెడ్డి, డిప్యూటీ కన్వీనర్లుగా ఆనందరావు, అమరేందర్‌రెడ్డి, రమేశ్, మహేశ్, కో-కన్వీనర్లుగా అమర్‌నాథ్‌రెడ్డి, వేణు, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, హరికిరణ్, నరేందర్, సతీశ్, ఫైనాన్స్ సెక్రటరీగా సాహెద్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా మహమూద్, అశోక్, రాజేందర్‌రెడ్డి, మమత, రచన, జమునా రాణి, ఈసీ మెంబర్లుగా శ్రీనివాస్ స్వామి, రవీందర్, సుగుణాకర్, మధుకర్, రాజేశం ఎన్నికయ్యారు.

## కాంక్రీట్ మిషన్ కింద పడి కార్మికుడి మృతి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 26: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో శనివారం కాంక్రీట్ మిషన్ కింద పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని పోచమ్మ గుడి వెనుక సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. కాగా, కాంక్రీట్ మిషన్ వెనుకకు వస్తున్న క్రమంలో డ్రైవర్ గమనించకపోవడంతో జలగం ఎల్లయ్య(33) అనే కార్మికుడి తగిలింది. ఎల్లయ్య కిందపడిపోవడంతో ముందు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా, ఎల్లయ్య స్వగ్రామం జనగామ జిల్లా దరిదపల్లి. నర్సింగాపూర్‌కు చెందిన గడ్డం మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపారు.

## ఐలాపూర్‌లో సైబర్ నేరాలపై అవగాహన

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో శనివారం పోలీస్ కళాబృందం సభ్యులు మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంచందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొంతం రాజం, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, గ్రామస్తులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ పోటీల్లో ఆర్ఐ ప్రతిభ

వెల్గటూర్, ఏప్రిల్ 26: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో వెల్గటూర్ ఆర్ఐ దొంత రాజేశ్వరీ 50 మీటర్ల విభాగంలో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. రాజేశ్వరీని తహసీల్దార్లు శేఖర్, అనిల్, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

## తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే

జగిత్యాల టవర్ సర్కిల్, ఏప్రిల్ 26: వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ మధుసూదన్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీవో చాంబర్‌లో శనివారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలైన కేసుల్లో కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు ఆర్డీవో ఎదుట విచారణకు హాజరు కాగా, కౌన్సెలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటీజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, కౌన్సెలింగ్ ప్రతినిధులు విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల టవర్ సర్కిల్, ఏప్రిల్ 26: జగిత్యాల పట్టణంలోని మోతె రోడ్డు, మోతే చౌరస్తా, చిలుకవాడ, జమ్మిగద్దె, అశోక్‌నగర్, దేవిశ్రీ గార్డెన్ వెనుక వైపు, బైపాస్ రోడ్డు, తహసీల్ చౌరస్తా, గాయత్రి బ్యాంక్ ఏరియా, బుక్కవాడ, మార్కెట్ రోడ్, మోచీ బజార్, కస్తూరి స్ట్రీట్ ఏరియాలకు ఆదివారం ఉదయం 8.30 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ రాజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె

కొడిమ్యాల, ఏప్రిల్ 26: తమ డిమాండ్లను నెరవేర్చాలని నాచుపల్లి జేఎన్టీయూ ఎదుట కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు చేతిలో చాక్పీస్ పట్టుకొని ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు.

## బీఆర్ఎస్ నాయకుడికి మాజీ మంత్రి పరామర్శ



రవీందర్‌ను ఓదార్చుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి, ఏప్రిల్ 26: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు చెవుల రవీందర్ తండ్రి రాజలింగయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా, శనివారం అంత్యక్రియలు నిర్వహించగా, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై రవీందర్‌ను పరామర్శించారు.

## విద్యార్థికి అభినందన

సారంగాపూర్, ఏప్రిల్ 26: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన కొల్లూరి ప్రభాకర్-జయ దంపతుల కూతురు కొల్లూరి ప్రణతి ఇంటర్ ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ)లో 994 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. కాగా, ప్రణతిని శనివారం గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

## బంద్ ప్రశాంతం

కథలాపూర్/పెగడపల్లి/మేడిపల్లి, ఏప్రిల్ 26: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా కథలాపూర్, పెగడపల్లి, మేడిపల్లిలో శనివారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆయా చోట్ల వ్యాపార, వాణిజ్య సంస్థలను స్వచ్ఛందంగా మూసి ఉంచారు. ఈ కార్యక్రమాల్లో హిందూ ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

## బార్, రెస్టారెంట్లలో తనిఖీలు



పర్మిట్ రూం యజమానికి జరిమానా రసీదు ఇస్తున్న అధికారులు

కోరుట్ల, ఏప్రిల్ 26: పట్టణంలోని బార్లు, రెస్టారెంట్లు, పర్మిట్ రూముల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఓ రెస్టారెంట్‌లో ఉపయోగిస్తున్న నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం కొని రూ. 8 వేల జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. వినియోగదారులకు తాజా ఆహారాన్ని అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీరు మహేశ్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఈత మొక్కలు దగ్ధం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26: అమ్మక్కపేట గ్రామ శివారులోని డబ్బాకు వెళ్లే రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు శనివారం ఈత మొక్కలు దగ్ధమయ్యాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో మూడెకరాల్లో పెంచుతున్న ఈత మొక్కలతో పాటు డ్రిప్ పైపులు దగ్ధమైనట్లు సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు నేరేళ్ల సుభాష్ తెలిపారు.

## అలరించిన వీడ్కోలు హంగామా

జగిత్యాల, ఏప్రిల్ 26: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో బీకాం చివరి సంవత్సరం విద్యార్థులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నరేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 26: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో టీఎస్‌కేసీ, టీఏఎస్‌కే ఆధ్వర్యంలో నాంది మహీంద్రా ప్రైడ్ క్లాస్‌రూమ్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ నీరజ మాట్లాడుతూ, 50 మంది విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ప్రజెంటేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై ట్రైనర్ అమూల్య శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ట్రైనర్ అమూల్యను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్‌కుమార్, నీరజ, డాక్టర్ వరప్రసాద్, లక్ష్మణ్, గీత, మహేందర్ రెడ్డి, తిరుపతి సన్మానించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ట్రైనర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు